సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 14 । మార్చి । 2025



సోమశిలలో 55.860 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారం 55.860 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 1600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.89,460
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,100
మూడు శాతం జీఎస్టీతో	రూ.8,343
సవర (8 గ్రాములు)	రూ.66,744

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.0 /25.5

జిల్లాలో వాతావరణం శుక్రవారం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ గురువారం 57 శాతంగా నమోదైంది.



ఇఫ్తార్	సహర్
శుక్రవారం	శనివారం
సా: 6.21	ఉ: 4.58

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

రీసర్వేలో అటవీ అధికారులు భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: ప్రస్తుతం జరుగుతున్న రీసర్వేలో అటవీ అధికారులు భాగస్వాములై భూముల వివాదాల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఓ.ఆనంద్ కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో అటవీ, వన్యప్రాణుల రక్షణపై సమీక్ష కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత జిల్లా అటవీశాఖ అధికారి మహబూబ్‌బాషా పలు విషయాలను వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భూ వివాదాల విషయమై రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రీసర్వేలో అవసరమైన గ్రామాల్లో అధికారులు హాజరై భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, ఆర్డీఓలు అనూష, పావని, వంశీకృష్ణ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి పరిమళ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

17 నుంచి టెన్త్ పరీక్షలు

- హాజరుకానున్న 33,434 మంది విద్యార్థులు

నెల్లూరు(టౌన్): జిల్లాలో పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈఓ ఆర్.బాలాజీరావు తెలిపారు. ఈ నెల 17 నుంచి 31వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మొత్తం 174 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, జిల్లా వ్యాప్తంగా 33,434 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయన్నారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా 9 ఫ్లయింగ్, 24 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించామన్నారు. విద్యార్థులు వారి హాల్ టికెట్లు చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. సమస్యల పరిష్కారం కోసం 83414 08109 ఫోన్ నంబర్‌తో కంట్రోలు రూంను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

పెద్దాస్పత్రిలో డీఎంఈ ఆకస్మిక తనిఖీలు

- విధుల్లో లేని వారికి షోకాజ్ నోటీసులివ్వాలని ఆదేశం



మాట్లాడుతున్న డీఎంఈ వెంకటేష్

నెల్లూరు(అర్బన్): డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (అడ్మిన్) వెంకటేష్ గురువారం విజయవాడ నుంచి వచ్చి నెల్లూరులోని సర్వజన ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఓపీలు, క్యాజువాలిటీ, వార్డులు పరిశీలించారు. పలు ఓపీల్లో డాక్టర్లు లేక ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. జూనియర్ డాక్టర్లు రోగులను పరిశీలిస్తున్నారు. విషయాన్ని అర్థం చేసుకున్న డీఎంఈ సంతకాలు చేసి విధుల్లో లేని డాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో లేని డాక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్‌ను ఆదేశించారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగరాజమన్నార్, డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి, అధికారులు, హెచ్ఓడీలు, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు, ఏపీఎంఎస్ఐడీసీ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఈ వెంకటేష్ మాట్లాడుతూ డాక్టర్లు సమయపాలన పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా జమ అయిన నిధులను హెచ్‌డీఎస్ కమిటీకి నిబంధనల మేరకు తరలించి వాటిని కనీస సౌకర్యాల కోసం ఖర్చు చేసుకోవాలని సూచించారు. అనంతరం తమ, తమ విభాగాలకు కొరత ఉన్న పరికరాల గురించి డాక్టర్లు నివేదిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ నరేంద్ర, డాక్టర్ మస్తాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పంటంతా దళారులకే..

'ధాన్యం మద్దతు ధర కంటే తక్కువగా కొంటే మిల్లర్లపై చర్యలు తీసుకుంటాం. రైతులు ఆందోళన చెందవద్దు. ప్రభుత్వం తోడుగా ఉంటుంది. 48 గంటల్లోపు ధాన్యం నగదు చెల్లింపులు చేస్తాం'

- కలెక్టర్ ఆనంద్ ఇటీవల మీడియా సమావేశంలో చెప్పిన మాటలివి.

కానీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కలెక్టర్ ఆదేశాలు అమలవుతున్నాయా? లేదా? తెలుసుకునేందుకు సాక్షి ప్రతినిధులు వాటిని గురువారం పరిశీలించగా అన్నదాతల అగచాట్లు వెలుగులోకి వచ్చాయి. ఎక్కడా కలెక్టర్ ఆదేశాలు అమలవుతున్న దాఖలాల్లేవు. కొన్ని ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాల తలుపులు తెరుచుకోలేదు. మరికొన్ని చోట్ల కొనుగోలు కేంద్రాల్లో పనిచేసే ఉద్యోగులు సవాలక్ష నిబంధనల్ని సాకుగా చూపుతుండటంతో రైతులు దళారులనే ఆశ్రయిస్తున్నారు.

- అలంకార ప్రాయంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- కొన్ని ప్రాంతాల్లో అసలు తెరుచుకోని వైనం
- రైతులకు నిబంధనలు, మిల్లర్లకు ప్రయోజనాలు
- గతేడాది పుట్టి ధాన్యం రూ.24 వేలు
- ప్రస్తుతం రూ.15 వేలు కూడా దాటని పరిస్థితి

ఈ చిత్రంలో కనిపిస్తోంది కావలి రూరల్ మండలం చలంచర్ల గ్రామానికి వెళ్లే క్రాస్ రోడ్డును దాటిన తర్వాత రహదారి పక్కన ధాన్యం కొనుగోలు ప్రక్రియ. దళారులు రైతుల నుంచి నేరుగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. రైతులు కూడా దళారుల అడ్డాకే ధాన్యం చేర్చుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో సవాలక్ష ఆంక్షలున్నందున అన్నదాతలు వాటి వైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో దళారులే రైతుల పొలాల వద్దకెళ్లి ధాన్యం కొనుగోలు చేస్తుండటం గమనార్హం. పొలాల్లోకే దళారులు తమ లారీలను, కాటాలను తీసుకెళ్లి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. – కావలి





ఈ ఫొటోలో కనిపిస్తున్నది కావలి రూరల్ మండలం చలంచర్ల గ్రామంలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రం. ఇక్కడ ధాన్యం కొనుగోలు కేంద్రం అని తెలియజేసేలా కనీసం చిన్న బ్యానర్ కూడా ఏర్పాటు చేయలేదు. చలంచర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని జిల్లా అధికారులు నెల్లూరులో కూర్చొని ఆర్భాటంగా ప్రకటనలు చేశారు. గ్రామంలోని రైతులు ధాన్యం అమ్మకాలు గురించి వాకబు చేయడానికి సచివాలయం వద్దకు వెళితే ఇక్కడ ధాన్యం ఎవరు కొంటున్నారు అంటూ విచిత్రమైన ప్రశ్నలు రైతులే ఎదుర్కొంటున్నారు. అందుకే గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం లేదనే నిశ్చితాభిప్రాయానికి రైతులు వచ్చారు. గ్రామంలో సుమారు 1,150 ఎకరాలకు పైగా వరి సాగు చేస్తారు. అయినప్పటికీ చలంచర్ల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఒక్క గింజ కూడా కొనలేదు. – కావలి

మిల్లర్ల దోపిడీ

ప్రభుత్వం నిర్దేశించిన విధంగా 17 శాతం తేమతో ధాన్యాన్ని సీఎంఆర్ కింద మిల్లుల వద్దకు తీసుకెళ్తే ప్రతి బస్తాకు రెండు కేజీల తరుగు ఇవ్వాలని మిల్లర్లు డిమాండ్ చేస్తూ అన్‌లోడింగ్‌కు కాలయాపన చేస్తున్నారు. దీంతో బస్తాల్లో ధాన్యం తడారిపోవడం, రవాణా వాహనాలకు చార్జీలు పెరిగిపోవడంతో చేసేదేమీ లేక మిల్లర్లు అడిగిన కాడికి ఇచ్చేసి రైతులు చేతులు దులుపుకుంటున్నారు. కొందరు రైతులేతే ఈ వెతలు పడలేక నేరుగా మిల్లరు, దళారి అడిగిన ధరకే కల్లాల్లోనే అమ్ముకుని బయటపడుతున్నారు.

సాక్షి విజిట్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో ధాన్యం అమ్ముకునేందుకు రైతులు అగచాట్లు పడుతున్నారు. మిల్లర్లు సిండికేట్‌గా మారి ధరలను దిగజార్చుతున్నారు. ఈ ఏడాదిలో జిల్లాలో సుమారు 7.70 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. అయితే వాతావరణ పరిస్థితులు అనుకూలించక దిగుబడులు పడిపోయాయి. ఇప్పటి వరకు కేవలం 10 నుంచి 15 శాతం మాత్రమే వరి కోతలు జరిగాయి. ఈ నెల రెండో వారం నుంచి కోతలు పూర్తిస్థాయిలో ఊపందుకుంటాయి.

పేరుకే కొనుగోలు కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా సుమారు 300 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 5864 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికార యంత్రాంగం చెబుతోంది. ఒక పక్క కలెక్టర్ ఆనంద్, మరో పక్క జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఎఓ సత్యవాణి కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కల్పిస్తామని చెబుతున్నారు. మిల్లర్లు, దళారులు ధరలు తగ్గిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ధాన్యం తేమ శాతం చూడడానికి మాయిశ్చర్ మెషీన్లు కూడా చాలా చోట్ల అందుబాటులో లేవని, ప్రభుత్వం నిర్దేశించిన తేమ శాతానికి ఆరబెట్టుకోవాలన్నా కొనుగోలు కేంద్రాల్లో కల్లాలు అందుబాటులో లేవని, కనీసం పట్టలు, ధాన్యం పట్టుబడికి అవసరమైన గోతాలు, రవాణా వసతి లేదని రైతులు వాపోతున్నారు. అయితే రైతులే వీటిని సమకూర్చుకుంటే ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుందంటూ అధికారులు చెబుతున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అన్నిచోట్ల దగా..

ధాన్యం క్రయవిక్రయాల్లో అన్నదాతలు అడుగడుగునా దగాకు గురవుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర (పుట్టి రూ.19,600)కు మిల్లర్లు కొనుగోలు చేయడం లేదు. గత ఏడాది పుట్టిధాన్యం రూ.24వేలకు అమ్ముకుంటే ఇప్పుడు రూ.15వేలకు కూడా కొనడం లేదని రైతులు వాపోతున్నారు. పైగా మిల్లర్లకే డ్రయ్యర్ చార్జీల కింద పుట్టి రూ.500 ప్రభుత్వం అందజేస్తోంది. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ధాన్యంలో తేమ శాతం 17 లోపు ఉండే విధంగా రైతులు పొలాల్లోనే ఆరబెట్టుకుని, వారే గోతాలు సమకూర్చుకుని రవాణా వసతి ఏర్పాటు చేసుకుంటూ అష్టకష్టాలు పడుతున్నారు. ప్రభుత్వ పరంగా ఏ విధంగానూ సాయం అందిస్తున్న దాఖలాలు లేవు.

రైతుల ముసుగులో దళారులు

రైతుల నుంచి తక్కువ ధరకే కొనుగోలు చేసిన తెలుగు తమ్ముళ్లు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. తమ పరపతి ఉపయోగించి రైతుల నుంచి భూముల పాస్‌బుక్‌లు తీసుకుని వారి పేర్లతో దళారులే ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. వీరికి ఉద్యోగులు సైతం సహకారం అందిస్తుండడంతో రైతులకు అన్యాయం జరుగుతోంది.



తలుపులు తెరుచుకోని పొదలకూరు బిట్-3 కొనుగోలు కేంద్రం

తెరుచుకోని తలుపులు

ఈ చిత్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం పొదలకూరు బిట్ – 3 సచివాలయం పక్కనే ఉన్న రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ధాన్యం విక్రయానికి ఇక్కడి రైతులు ఎవరూ రాలేదు. దీంతో ఈ కేంద్రం తలుపులు కూడా గురువారం తెరవలేదు. ఇక్కడ ఒక్కరే సిబ్బంది ఉండటం వల్ల ఆమె రెండు రోజులు సెలవు పెట్టినట్టు సమాచారం. ఆర్ఎస్‌కేకు ప్రస్తుతం విద్యుత్ సౌకర్యం కూడా లేదు. బిల్లులు చెల్లించలేదని కరెంట్ కట్ చేసినట్టు సమాచారం. – పొదలకూరు

మూసేసి..



తెరుచుకోని ధాన్యం కొనుగోలు కేంద్రం

ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలిగిరిలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేశారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్మడానికి ముందుకు రాకపోవడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తెరవడం లేదు. గురువారం కూడా ఇదే పరిస్థితి. మండలంలో సుమారు 2వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పటికే ఎక్కువ మంది రైతులు వరి కోతలు పూర్తి చేసి ధాన్యాన్ని బయట వ్యాపారులకు అమ్ముకున్నారు. – కలిగిరి

బయట వ్యాపారులకే అమ్ముకున్నాం



నేను నాలుగు ఎకరాల్లో వరిపంటను సాగు చేశాను. సకాలంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదు. 10 పుట్ల వరి ధాన్యాన్ని బయట వ్యాపారులకు అమ్ముకోవాల్సి వచ్చింది. రైతులు పండించిన వరి, పచ్చిశనగ పంటను ఎప్పటికపుడు వ్యాపారులు పొలాల వద్దకే వచ్చి తీసుకువెళుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వల్ల ఎటువంటి ప్రయోజనం లేదు.

– పెద్దిరెడ్డి వెంకారెడ్డి, చంద్రారెడ్డిపాళెం, కలిగిరి మండలం



నేత్రపర్వం.. తెప్పోత్సవం

- దర్శించి... తరించిన భక్తులు

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం గురువారం భక్తజన సంద్రంగా మారింది. క్షేత్రవాసి ప్రసన్న వేంకటేశ్వరస్వామిని బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడవాహనసేవలో దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో బుధవారం సాయంత్రం నుంచే బిలకూట క్షేత్రం కిటకిటలాడింది. ఉత్సవాలు, ఆపద సమయాల్లో స్వామికి వరపడిన భక్తులంతా బ్రహ్మోత్సవాల్లో సమారాధనల పేరిట మొక్కుబడులు చెల్లించుకోవడం ఆనవాయితీ. ఉత్సవాలు, వాహన సేవల్లో అర్చకులు, ఆగమ పండితులు ప్రధాన పాత్ర పోషిస్తే మొక్కుబడుల రోజు మాత్రం భక్తులే నేరుగా స్వామిని కొలుస్తారు. సంప్రదాయానికి కొనసాగింపుగా జలదంకి, కావలి, అల్లూరు, దగదర్తి తదితర మండలాలకు చెందిన భక్తులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై అధిక సంఖ్యలో తరలివచ్చారు. గరుడవాహనంపై స్వామిని దర్శించుకుని, పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేశారు. భక్తితో తలనీలాలు సమర్పించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో, కొండదిగువన సామూహికంగా పొంగళ్లు పొంగించి భక్తితో ప్రసన్నునికి నివేదించారు. అనంతరం ఎవరికి వారు శక్తిమేర అన్నదానం చేశారు.

పుష్కరిణిలో జలవిహారం

ప్రసన్న వేంకటేశ్వరస్వామి గురువారం రాత్రి పుష్కరిణిలో జలవిహారం చేశారు. కలాణోత్సవానికి సిద్ధమయ్యే ప్రక్రియలో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేతంగా పెండ్లికుమారుడైన స్వామి వారు కొండపై కొలువుదీరగా అర్చకులు వైఖానస ఆగమోక్తంగా తెప్పోత్సవానికి సిద్ధం చేశారు. ఉభయదేవేరులను, స్వామిని కొండ దిగువన ఉన్న పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. అప్పటికే వివిధ రకాల పుష్పాలు, పట్టుపీతాంబరాలతో సిద్ధం చేసిన తెప్పపై స్వామివారిని ఉభయదేవేరులతో కొలువుదీర్చి జలవిహారం చేశారు.

- తెప్పోత్సవం పూర్తి చేసుకున్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి గజవాహనంపై ఊరేగారు.

5,864 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

నెల్లూరు రూరల్: జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 5,864.600 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జేసీ కార్తీక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం 927 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలియజేశారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ 24 నుంచి 48 గంటల్లోగా వారి బ్యాంక్ ఖాతాలకు డబ్బులు జమ చేస్తున్నట్లు తెలిపారు. రైతులందరూ కూడా దళారుల మాటలు విని తక్కువ ధరకు అమ్ముకోవద్దని సూచించారు.


అవినీతి విస్తరణ అధికారి

కోవూరు మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఓ అధికారి అవినీతిని విస్తరిస్తున్నారు. బాగా ఆదాయవనరులున్న పంచాయతీ కార్యదర్శులకు నెలకు ఇంత ఇవ్వాలనే టార్గెట్ పెట్టి వేధింపులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకోసం ఆకాశరామన్న పేరుతో ఆయా కార్యదర్శులపై ఫిర్యాదు చేసినట్లు లేఖలు సృష్టిస్తున్నారు. వాటిపై కలెక్టర్, డీపీఓ కార్యాలయాల స్టాంప్‌లతో ముద్రలు వేసి విచారణకు ఆదేశించారంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు కార్యదర్శులు వాపోతున్నారు. ఇటీవల పడుగుపాడు పంచాయతీ కార్యదర్శిపై మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు బయటపడిన రెండు లేఖలు ఇందుకు అద్దం పడుతున్నాయి.

ఆకాశరామన్న పేరుతో ఫిర్యాదులు

కలెక్టర్, డీపీఓ కార్యాలయాల సీళ్లు దుర్వినియోగం

- విచారణ పేరుతో పంచాయతీల విజిట్
- రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఇవ్వాలని డిమాండ్
- లేకుంటే వేధింపులు, బెదిరింపులు



కోవూరు: జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో గతంలో పనిచేస్తూ పదోన్నతి పొంది కోవూరు ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఓ అధికారి పోతిరెడ్డిపాళెంలో ఇల్లు కట్టుకొంటున్నాను.. నాకు నెల మామూళ్లు ఇవ్వాలంటూ పంచాయతీ కార్యదర్శులకు టార్గెట్లు పెడుతున్నారు. ముఖ్యంగా మండలంలో ఆదాయం బాగా ఉండే కోవూరు, పడుగుపాడు, పోతిరెడ్డిపాళెం, గంగవరం, పాటూరు, ఇనమడుగు పంచాయతీలను టార్గెట్ చేసి, సంబంధిత కార్యదర్శులను టార్చర్ పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే పడుగుపాడు పంచాయతీకి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంలో అక్రమాలు జరిగాయంటూ రికార్డులు తీసుకెళ్లారు. అదే సమయంలో ఈ పంచాయతీలో అవినీతి జరిగిందంటూ ప్రకాశం జిల్లాకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఫిర్యాదుదారుడి సంతకం లేని ఓ కాపీలో కలెక్టర్, డీపీఓ కార్యాలయాల స్టాంప్స్ (సీళ్లు) వేసి లేఖలు సృష్టించారు. మరో కాపీలో జూపూడి సంతకం ఉన్నట్లు (ఫోర్జరీ) ఉంది. ఈ లేఖలు నకిలీవని, వీటి వెనుక సదరు మండల అధికారి ఉన్నట్లు విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

విజిట్ పేరుతో వసూళ్లు

తాను టార్గెట్ చేసిన పంచాయతీలకు తరచుగా విజిట్ చేస్తూ వేధింపులు, వసూళ్లకు పాల్పడుతున్నారని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. ఆయన అడిగినప్పుడల్లా కలెక్షన్ ఇవ్వకపోతే జిల్లా పంచాయతీ అధికారికి నీపై ఫిర్యాదు చేస్తానని బెదిరిస్తున్నాడని కార్యదర్శులు బోరుమంటున్నారు. గంగవరం కార్యదర్శి సదరు అధికారి ఒత్తిడి తట్టుకోలేక ఏకంగా ఈ మండలమే నాకు వద్దంటూ బదిలీ చేయించుకుంది. పోతిరెడ్డిపాళెం కార్యదర్శి నా వల్ల కాదు ఏం చేసుకుంటావో చేసుకోమని తెగేసి చెప్పారని సమాచారం. నాలుగు రోజుల క్రితం పడుగుపాడు పంచాయతీ కార్యాలయంలో తనిఖీల పేరుతో ఏకంగా కొన్ని రికార్డులను ఎత్తుకెళ్లారు. పోతిరెడ్డిపాళెం పంచాయతీ కార్యదర్శికి రిటైర్మెంట్‌కు ఏడాది కాలం ఉంది. అటువంటి ఉద్యోగిని సైతం వేధింపులకు గురి చేయడంపై మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఏమైనా రిమార్కులు ఉంటే రావాల్సిన బెనిఫిట్స్ ఆగిపోతాయని భయంతో అడిగినంత ఇచ్చుకోలేని పరిస్థితిలో పంచాయతీ కార్యదర్శులు కొట్టుమిట్టాడుతున్నారు.

రికార్డులు పోతే బాధ్యులు ఎవరు?

విచారణ పేరుతో పడుగుపాడు పంచాయతీ రికార్డులు మండల పంచాయతీ అధికారి తీసుకెళ్లారు. ఆ రికార్డులు తానే తీసుకెళుతున్నట్లు ధ్రువీకరణ పత్రం కూడా ఇవ్వలేదు. రేపు ఆ రికార్డులు గల్లంతు అయితే ఎవరు బాధ్యులని, తన కార్యాలయం రికార్డులు తిరిగి ఇచ్చేయాలని అడిగిన కార్యదర్శిపై నానా దుర్భాషలు ఆడినట్లు తెలిసింది. గ్రామ పంచాయతీ రికార్డుల విషయంలో ఏమైనా తేడాలు జరిగితే పెద్ద నేరమవుతుందని జిల్లా పంచాయతీ కార్యాలయాధికారులు చెబుతున్నారు.

వేధింపులు మరింత పెంచుతూ..

తాను అడిగిన విధంగా లంచాలు ఇవ్వని పంచాయతీలకు వెళ్లి అయిదు, పది నిమిషాలు లేటుగా వస్తే వారిని కూడా బెదిరిస్తున్నాడు. లంచాలు ఇవ్వాల్సిన అవసరం ఏమిటని అడిగితే, మీ పంచాయతీ పరిధిలో లేఅవుట్లు బాగా ఉన్నాయి. అవి పంచాయతీ లేఅవుట్లా లేక నుడా లేఅవుట్లా అని ఆయా యజమానులను అడిగి తనకు కమీషన్లు ఇవ్వాలని కార్యదర్శిని బెదిరిస్తున్నారని వాపోతున్నారు. ఇదే సమయంలో పడుగుపాడు పంచాయతీలో అవినీతి మీద ఆకాశరామన్న ఉత్తరం రావడంతో విచారణ పేరుతో రికార్డులు తీసుకుని వెళ్లిపోయారు. అయితే ఆకాశరామన్న ఉత్తరం సదరు అధికారి పనిగానే స్థానికులు భావిస్తున్నారు. ఒక పంచాయతీ కార్యదర్శి మీద ఫిర్యాదు వస్తే జిల్లా పంచాయతీ అధికారి, మరో అధికారి విచారణ చేయాలి. సదరు అధికారులు విచారణకు ఆదేశించాలి. కానీ అవేమీ లేకుండా ఉత్తరం పట్టుకుని వచ్చి విచారణ పేరుతో వేధింపులకు గురిచేయడాన్ని కార్యదర్శులు ఖండిస్తున్నారు.

విచారణ చేపడతాం

ఎవరినైనా ఇబ్బందులకు గురిచేస్తే నిర్భయంగా నా దష్టికి తీసుకురావొచ్చు. ఎటువంటి అడ్రస్స్ లేకుండా ఫిర్యాదులొస్తే అలాంటి వాటిపైనా విచారణ పేరుతో కార్యదర్శులను మానసిక క్షోభకు గురి చేయడం మంచిది కాదు. పంచాయతీ రికార్డులు జిల్లా స్థాయి అధికారి అనుమతి లేకుండా బయటకు పోకూడదు. అలా తీసుకెళితే అందుకు సంబంధిన రసీదు పంచాయతీ కార్యదర్శికి ఇవ్వాలి. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టి, చర్యలు తీసుకుంటాం. – శ్రీధర్‌రెడ్డి, డీపీఓ


బస్సు ఎక్కేందుకు వెళ్తూ..


పెట్టెతో ఇంటికి బయలుదేరుతూ..


విద్యార్థుల కేరింతలు


ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్న విద్యార్థులు


బస్సు ఎక్కుతున్న విద్యార్థులు

విద్యార్థుల్లో ఫుల్ జోష్

నెల్లూరు(టౌన్): ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఈనెల ఒకటో తేదీన పరీక్షలు మొదలయ్యాయి. చివరిరోజు కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు జరిగాయి. వీటికి జనరల్‌కు సంబంధించి 27,753 మందికి గానూ 26,961 మంది హాజరయ్యారు. 792 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 738 మందికి గానూ 634 మంది హాజరయ్యారు.104 మంది గైర్హాజరయ్యారు. ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు ఆత్మకూరులోని ప్రభుత్వ, ప్రియదర్శిని, బీఎస్ఆర్, వింజమూరులోని వైఆర్ వికాస్ జూనియర్ కళాశాలలను తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు కాగితాలను చింపి కేకలు వేశారు. హాస్టళ్లలో ఉంటున్న వారు ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌కు చేరుకుని సొంతూర్లకు బయలుదేరారు.

క్లుప్తంగా

మహిళ కుటుంబానికి చేయూత


సుభాషిణి కుటుంబాన్ని పరామర్శిస్తున్న దాత

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గుండె, మెదడు సంబంధిత సమస్యలతో బాధపడుతూ పూటగడవక ఇబ్బందులు పడుతున్న సుభాషిణి అనే మహిళకు దాతలు సాయం చేశారు. గురువారం సాక్షిలో 'ఆమె జీవితం కష్టాలమయం' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో 54వ డివిజన్ జనార్దనరెడ్డికాలనీ ప్రాంతానికి చెందిన మల్లికార్జున బియ్యం, కూరగాయలు, నిత్యావసర వస్తువులు అందజేశారు.

నకిలీ ఎస్సై అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్

సంగం: మండలంలోని సంగంలో నకిలీ ఎస్సైగా చెలామణీ అవుతున్న హరీష్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. సంగం పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ వివరాలు వెల్లడించారు. హరీష్ నకిలీ ఎస్సై అవతారమెత్తి వాహనాలు ఆపి రికార్డులు పరిశీలిస్తున్నాడు. దీనిపై సమాచారం అందడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి కారు, నకిలీ యూనిఫాం, బెల్ట్, బూట్లు, నంబర్ ప్లేట్, టోపీ, స్టార్స్ తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. 2023లో వచ్చిన ఎస్సై ఫలితాల్లో ఎంపికయ్యానని సిద్ధీపురానికి చెందిన హరీష్ అందరినీ నమ్మించాడు. ఎస్సై యూనిఫాం ధరించి పలు ప్రాంతాల్లో వాహనాలు నిలిపి నగదు వసూళ్లకు పాల్పడుతున్నాడని డీఎస్పీ వెల్లడించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తామని చెప్పారు. కేసును ఛేదించిన సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్, సిబ్బందిని అభినందించారు.

15 నుంచి అందుబాటులోకి మ్యూజియం

నెల్లూరు రూరల్: నెల్లూరు సరస్వతి నగర్‌లో ఉన్న పురావస్తు శాఖ మ్యూజియం ఈనెల 15వ తేదీ నుంచి అందుబాటులోకి వస్తుందని సహాయ సంచాలకుడు జి.గంగాధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో మున్సిపల్ శాఖ నిధులతో ఆధునికీకరణ పనులు చేపట్టినట్లు తెలియజేశారు. పురాతన వస్తువులు, రాజుల కాలం నాటి నాణేలు, అరుదైన శిల్పాలు ఉన్నాయన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన కారు

- ఒకరికి తీవ్రగాయాలు


ఘటనా స్థలంలో ట్రాక్టర్, కారు

దగదర్తి(బిట్రగుంట): దగదర్తి మండలం ఉలవపాళ్ల కూడలి వద్ద ట్రాక్టర్‌ను కారు ఢీకొట్టిన ఘటన గురువారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. ఉలవపాళ్ల కూడలి వద్ద మలుపు తిరుగుతున్న ట్రాక్టర్‌ను ఒంగోలు నుంచి నెల్లూరుకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు ట్రాక్టర్ ఇంజిన్ రెండుగా విడిపోయింది. ట్రాక్టర్ విడిభాగాలు రోడ్డుపైన చెల్లాచెదురుగా పడిపోయాయి. డ్రైవర్ రోడ్డుపై పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కారులోని ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో కావలి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ స్తంభించకుండా చర్యలు చేపట్టారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.75
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.30



వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

- కార్పొరేషన్‌లో రెచ్చిపోయిన అధికార పార్టీ కార్పొరేటర్లు
- సమస్యలు తర్వాత.. ఆర్థిక అంశాలే ముఖ్యం
- పలువురు సభ్యుల మధ్య మాటల యుద్ధం
- వైఎస్సార్‌సీపీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాల్లేవు
- అజెండాలోని 91 అంశాలు ఆల్ పాస్


బొబ్బల శ్రీనివాస యాదవ్‌తో రూప్‌కుమార్ యాదవ్ వాగ్వాదం

నెల్లూరు(బారకాసు): నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం గురువారం వాడీవేడిగా జరిగింది. పలువురు కార్పొరేటర్ల మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు సమస్యలపై అడిగిన ప్రశ్నలకు అధికారుల నుంచి సమాధానాల్లేవు. ఏపీజే అబ్దుల్ కాలం సమావేశ మందిరంలో మేయర్ స్రవంతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమస్యల కంటే అంజెండా ఆమోదమే మిన్న అంటూ అధికార సభ్యులు వ్యవహరించడంపై వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు మండిపడుతున్నారు. అజెండాలో పొందుపరిచినవి ఆర్థిక అంశాలేనని.. నిబంధనలకు విరుద్ధంగా ఇన్‌యాంటిసిపేషన్ ఆర్డర్లకు సంబంధించిన అజెండాను తయరు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార కార్పొరేటర్లు.. వైఎస్సార్‌సీపీ వారిని మాట్లాడనివ్వకుండా అడుగడుగునా అడ్డు తగులుతూ సమావేశాన్ని సజావుగా జరగనివ్వలేదు. చివరకు అజెండాలోని 91 అంశాలను ఆల్‌పాస్ చేసి ముగించారు. వివిధ సమస్యలపై వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు మేయర్‌కు వినతిపత్రం అందించారు.

రెచ్చిపోయి..

ముందుగా డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ అజెండాలోని అంశాలను చదివి వినిపించి ఆమోదింపజేసే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. దీంతో 37వ డివిజన్ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస యాదవ్ ముందుగా సమస్యలను చెప్పేందుకు అవకాశం ఇవ్వాలని అడగ్గా అందుకు డిప్యూటీ మేయర్ తాను చెప్పిందే జరగాలంటూ అజెండా అంశాలను పూర్తి చేయాలన్నారు. దీంతో ఇరువురి మధ్య కొంతసేపు వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో 13వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున తన సహచరుడు అడిగినట్లుగా తొలుత సమస్యలపై చర్చింకునేందుకు అవకాశం కల్పి ంచాలన్నారు. అయితే 9వ డివిజన్‌కు చెందిన టీడీపీ కార్పొరేటర్ దామవరపు రాజశేఖర్ నీవేంటి మాట్లాడేదంటూ నాగార్జున మీద రెచ్చిపోయాడు. కొందరు కలుగజేసుకుని సర్దిచెప్పారు. అనంతరం 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి సమస్యలు చెప్పి కమిషనర్ సమాధానం ఇవ్వాలని పట్టుబట్టారు. 46వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ వేలూరు ఉమామహేష్ ప్రతి విషయానికి కమిషనర్ సమాధానం చెబుతుంటే సమయం సరిపోదని, మిగిలిన వారికి అవకాశం ఇవ్వాలన్నారు. ప్రతాప్‌రెడ్డి నీకెందుకంటూ మొదలుపెట్టగా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మేయర్ వారికి సర్ది చెప్పారు.

అడ్డుపడుతూ..

వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు పలు సమస్యలకు సంబంధించిన అంశాలపై మాట్లాడుతుంటే అధికార పార్టీ కార్పొరేటర్లు అకారణంగా అడ్డుపడుతూ వచ్చారు. అధికశాతం మంది తమ డివిజన్లలో అనేక సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మేయర్ స్పందించి కార్పొరేటర్లు తెలియజేసిన సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ తహసిన్, కో–ఆప్షన్ సభ్యులు, కమిషనర్ సూర్యతేజ, అదనపు కమిషనర్ నందన్, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్ఈ రామ్మోహన్‌రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, మేనేజర్ ఇనాయతుల్లా, అన్ని విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సోలార్ ప్రాజెక్ట్

మేయర్ స్రవంతి మాట్లాడుతూ ప్రధాన అజెండాలోని 68 అంశాలు, సప్లిమెంటరీలోని 15 అంశాలు, టేబుల్ అజెండాలోని 8 అంశాలకు కార్పొరేటర్ల ఆమోదం తెలపడం జరిగిందన్నారు. రూ.60 కోట్లతో నూతనంగా సోలార్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్ఎంసీకి సంబంధించిన ఖాళీ స్థలాలకు ప్రహరీ ఏర్పాటు చేసేందుకు రూ.25 కోట్ల నిధులు కేటాయించి ప్రతిపాదించారన్నారు.


నాగార్జున, ప్రతాప్‌రెడ్డిల మధ్య వాగ్వాదం


మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్లు


ఊటుకూరు నాగార్జునను బెదిరిస్తున్న టీడీపీ కార్పొరేటర్

ఎవరేమన్నారంటే..

→ 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస యాదవ్ ఇలా మాట్లాడారు. ప్రధాన అజెండాలోని అంశాల్లో మొత్తం 68 ఉండగా ఇందులో 60 అంశాలకు ముందస్తు అనుమతులున్నాయి. రూ.10 లక్షలకు నిధులు పైగా ఖర్చు చేయాలంటే కౌన్సిల్ అనుమతి తీసుకోవాలి. అలా చేయకుండానే రూ.200 కోట్లకు ముందస్తు అనుమతులిచ్చేశారు. ఇది సరైన పద్ధతి కాదు. ఎస్ఎంసీలో అధికారులు కొన్ని బదిలీలను నిబంధనలకు విరుద్ధంగా చేశారు. మేనేజర్, ఇద్దరు ఆర్వోలను బదిలీ చేసి ఆ ముగ్గురి స్థానాల్లో సూపరింటెండెంట్ కేడర్ ఉన్న అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. సచివాలయ ఉద్యోగులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులపై కూడా చర్చించారు.

→ 13వ డివిజన్ కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున మాట్లాడుతూ నగర పాలక కమిషనర్ అధికారులతో కలిసి నా డివిజన్ పర్యటనకు వచ్చినప్పుడు కనీసం సమాచారం కూడా ఇవ్వడం లేదు. అదే టీడీపీలో చేరిన కార్పొరేటర్లకు మాత్రం సమాచారం ఇస్తున్నారు. ఇదెక్కడి న్యాయం?, కమిషనర్‌కు ఫోన్ చేస్తే కనీసం స్పందించడం లేదని ఇది ఎంతవరకు సబబని మేయర్ దృష్టికి తీసుకెళ్లారు.

→ 37వ డివిజన్ కార్పొరేటర్ వేలూరు ఉమామహేష్ ఇలా స్పందించారు. ట్రేడ్ లైసెన్స్‌లు, ఇంటి పన్నులను వసూలు చేసే విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పించి వారిని చైతన్యవంతుల్ని చేయాలి. అప్పుడే ఇబ్బందులుండవు. నగరంలో దోమలు విపరీతంగా ఉన్నాయని వీటి నియంత్రణకు సరైన చర్యలు చేపట్టాలి.

→ 21వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరీ ఇలా మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ పాలనలో నిధుల డైవర్షన్ జరిగిందని మున్సిపల్ శాఖ మంత్రి అంటున్నారు. 2019 నుంచి 2024 వరకు ఎస్ఎంసీకి వచ్చిన అన్ని రకాల నిధులు, జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి విషయాలను ప్రజలకు తెలియజేయాలి. అజెండాలోని అంశాలు అధిక శాతం ఇన్‌యాంటిసిపేషన్ (ముందస్తు అనుమతులు)కు సంబంధించినవే పొందుపరిచారు. ఇది సరైన పద్ధతి కాదు. 21వ డివిజన్‌లో ప్రధాన డ్రెయిన్‌ను నిర్మాణం చేపట్టాలి. మాగుంట లేఅవుట్‌లో వాకింగ్ ట్రాక్, సైన్స్ పార్కు పక్కన ఉన్న రైల్వే లైన్ వెంబడి స్థలాన్ని బ్యూటిఫికేషన్ చేయాలి.


మాట్లాడుతున్న గౌరీ

డీసీపల్లిలో అగ్నిప్రమాదం


కాలిపోయిన పూరిళ్లు


కూలీలకు దుస్తులు అందజేస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్

- పది గుడిసెలు, ఆటో, బైక్ దగ్ధం
- రూ.4 లక్షలకు పైగా ఆస్తి నష్టం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి గ్రామంలో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. ఓ బ్యారెన్ సమీపంలో తాత్కాలికంగా వలస కూలీలు ఏర్పాటు చేసుకున్న పది గుడిసెలు దగ్ధమయ్యాయి. స్థానికులు, అధికారుల కథనం మేరకు.. డీసీపల్లిలో ఓ పొగాకు బ్యారెన్‌లో పని చేసుకునే కూలీలు సమీపంలోనే తాత్కాలికంగా గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారు. గురువారం ఉదయం పనికి వెళ్లగా 9.45 గంటల సమయంలో ఒక్కసారిగా గుడిసెల్లో మంటలు వ్యాపించాయి. పదిగుడిసెలు పూర్తిగా కాలిపోయాయి. నాలుగు గ్యాస్ సిలిండర్లు పేలిపోయాయి. అంతేకాక ఒక ఆటో, ఒక మోటార్‌బైక్, నాలుగు మొబైల్ ఫోన్లు, సామగ్రి దగ్ధమవడంతో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. మర్రిపాడు ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్, ఆత్మకూరు సీఐ గంగాధర్, ఎస్సై శ్రీనివాసరావు, అగ్నిమాపక కేంద్రం అధికారి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటు చేసుకుని ఉంటుందని కేసు నమోదు చేసుకున్నారు. రూ.4 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు చెబుతున్నారు.

- సర్వం కోల్పోయిన కుటుంబాలకు ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్ అండగా నిలిచారు. సొంత నిధులతో దుస్తులను అందజేశారు. పది కిలోల వంతున బియ్యం పంపిణీ చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వానికి నివేదిక అందజేసి బాధితులకు నష్ట పరిహారం అందేలా కృషి చేస్తామని తెలిపారు.

కాలువలో దూకి వివాహిత ఆత్మహత్య


సుహాసిని మృతదేహం

నెల్లూరు(క్రైమ్): ఓ వివాహిత నెల్లూరులోని జాఫర్‌సాహెబ్ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మనుమసిద్ధినగర్‌లో ఎం.వెంకటేశ్వర్లు, సుహాసిని (54) దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమారులున్నారు. వెంకటేశ్వర్లు ఆర్ఆర్ స్ట్రీట్‌లోని కేపీసీ ప్లాజాలో ఫ్యాన్సీ షాపు నిర్వహిస్తున్నాడు. అతడి తల్లి రంగమ్మ ఈనెల నాలుగో తేదీన మృతిచెందారు. అప్పటి నుంచి సుహాసిని మానసికంగా కుంగిపోయింది. ఈ నేపథ్యంలో గురువారం భర్త దుకాణానికి వెళ్లగా సుహాసిని ఇంట్లో నుంచి ఎటో వెళ్లిపోయింది. ఆమె కనిపించడం లేదని కుటుంబ సభ్యులు వెంకటేశ్వర్లుకు ఫోన్ చేసి తెలియజేశారు. దీంతో ఆయన తన చిన్న కుమారుడు అజయ్‌తో కలిసి గాలింపు చేపట్టారు. పెన్నానది సమీపంలో వెతుకుతుండగా అక్కడున్న వారు కొద్దిసేపటి క్రితం జాఫర్‌సాహెబ్ కాలువలో ఓ మహిళ దూకడంతో స్థానికులు ఆమెను బయటకు తీసి ఒడ్డున పెట్టారని చెప్పారు. దీంతో వెంకటేశ్వర్లు అక్కడికి వెళ్లి చూడగా సదరు మహిళను సుహాసినిగా గుర్తించి చికిత్స నిమిత్తం నగరంలోని రామచంద్రారెడ్డి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సుహాసిని మృతిచెందినట్లు నిర్ధారించారు. బాధితులు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై బాలకృష్ణ మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

మానవత్వం మాయం

- అనాథ మృతదేహాలంటే అలుసే..


వృద్ధుడి మృతదేహం

నెల్లూరు(అర్బన్): కొందరు విధి వంచితులై అనాథలుగా మారుతారు. అలాంటి వారు చనిపోతే మానవత్వం ప్రదర్శించాల్సిందిపోయి తమకేం పట్టనట్లుగా ఉంటున్నారు కొందరు పెద్దాస్పత్రి సిబ్బంది, పోలీసులు. గుర్తు తెలియని వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతూ కొన్నిరోజులు నెల్లూరులోని పెద్దాస్పత్రిలో చికిత్స పొందాడు. ఆయనకు ఎవరూ లేకపోవడంతో ఆస్పత్రి ఆవరణలోనే ఉంటున్నాడు. జనం ఏదైనా పెడితే తింటూ అక్కడే పడుకునేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఆర్వో ప్లాంట్ వద్ద మృతిచెందాడు. గురువారం సాయంత్రం 4.30 గంటల వరకు కూడా మృతదేహాన్ని అక్కడి నుంచి మార్చురీకి తరలించలేదు. దుర్వాసన రావడం మొదలైంది. పోలీసులొచ్చి వివరాలు సేకరించాక మృతదేహాన్ని మార్చురీకి తీసుకెళ్లారు. ఈ విషయంపై ఆస్పత్రి అధికారులను వివరణ కోరగా తాము పోలీసులకు సమాచారమిచ్చామని, వారు రాలేదని తెలిపారు. తమకు సకాలంలో సమాచారం రావడం లేదని పోలీసులు అంటున్నారు. రెండు నెలల క్రితం ఓ అనాథ వృద్ధురాలి విషయంలో ఇలాగే జరిగింది. ఆమె చనిపోయాక పక్కరోజు మధ్యాహ్నం వరకూ తరలించలేదు.